క్లుప్తంగా

జేఈఈలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

వైరా: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ప్రకటించిన జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని వైరాలోని న్యూలిటిల్ ఫ్లవర్స్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు తెలిపారు. కళాశాల నుంచి 36మంది పరీక్షకు హాజరుకాగా 19 మంది అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారని, ఇందులో 9మంది 90కి పైగా పర్సంటైల్ సాధించారని వెల్లడించారు. విద్యార్థులను కరస్పాండెంట్, డైరెక్టర్ కుర్రా సుమన్, అధ్యాపకులు బుధవారం అభినందించారు.

కరాటే పోటీల్లో..



భార్గవిని అభినందిస్తున్న దృశ్యం

ఏన్కూరు: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని భార్గవి కరాటే పోటీలో తన ప్రతిభను చాటింది. ఈ నెల 9న వీయంబంజరలో పనకసి చోటా స్పోర్ట్స్ అసోసియేషన్ వారు నిర్వహించిన పోటీల్లో భార్గవి సిల్వర్ పతకాన్ని సాధించింది. దీంతో విద్యార్థిని ప్రిన్సిపాల్ చంద్రిక, పీఈటీ నరసయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్సెస్సీ అంతర్గత మార్కుల పరిశీలన



మార్కుల జాబితాను పరిశీలిస్తున్న అధికారులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కుల జాబితాను ఎంఈఓ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు బుధవారం పరిశీలించాయి. మొత్తం ఐదు బృందాలు పాఠశాలలను సందర్శించి విద్యార్థుల అంతర్గత మూల్యాంకనాలను పరిశీలించినట్లు ఎంఈఓ తెలిపారు.

సహాయ ఉపకరణాల పంపిణీకి శిబిరం



వృద్ధులకు జ్యూస్ అందజేస్తున్న డీడబ్ల్యూఓ రాంగోపాల్‌రెడ్డి

మధిర: వయోవృద్ధులు, దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ కోసం మధిరలోని రైతువేదికలో బుధవారం ఎంపిక శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా సంక్షేమాధికారి వి.రాంగోపాల్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. అర్హులుగా నిర్ధారించిన వృద్ధులు, దివ్యాంగులకు చేతి కర్రలు, వాకర్లు, వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్లను అలింకో సంస్థ ఆధ్వర్యాన అందజేయనున్నట్లు తెలిపారు. శిబిరంలో పాల్గొన్న వారికి పసుమర్తి సుబ్బారావు, కర్రి భానుమతి ఆధ్వర్యాన పండ్ల రసాలు, పులిహోర అందజేశారు. సీడీపీఓ జె.బాలాత్రిపురసుందరి, ఏసీడీపీఓ జి.కృష్ణశ్రీ, సూపర్‌వైజర్లు కె.జ్యోతికుమారి, టి.సుజాతకుమారి, బి.మధులత, ఎల్.సునీత, బి.రమాదేవి, తోక సరిత, అలింకో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రవీందర్‌ను గెలిపించండి

ఎర్రుపాలెం: ఈ నెల 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్టీయూ బలపరిచిన అభ్యర్థి పూల రవీందర్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎస్టీయూ సంఘం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంలో నిర్వహించిన మండల కమిటీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ కరామత్ అలీ, నాయకుడు మాధవరావు తదితరులున్నారు.

పట్టుబడిన వాహనాలకు నేడు వేలం

కారేపల్లి: సింగరేణి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులకు పట్టుబడిన ద్విచక్రవాహనాలకు కారేపల్లి క్రాస్‌రోడ్డులోని ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ స్రవంతి, ఎస్ఐ వసంతలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12గంటలకు జరిగే వేలం పాటలో పాల్గొనే పాటాదారులు ద్విచక్రవాహనాలకు నిర్ణయించిన ధరలో 50శాతం దరావత్తు సొమ్ము చెల్లించాల్సి ఉంటుందన్నారు.

'స్థానిక' సమరానికి సై



పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికలకు కార్యాచరణ

- గ్రామాల్లో ప్రారంభమైన ఎన్నికల సందడి
- సత్తా చాటేందుకు రాజకీయ పార్టీల వ్యూహం

చింతకాని: స్థానిక సంస్థల ఎన్నికల తేదీలతో పాటు బీసీ రిజర్వేషన్ల ఖరారుపై స్పష్టత వచ్చే సూచనలు కనిపిస్తుండటంతో స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. దీంతో గ్రామాల్లో స్థానిక ఎన్నికల సందడి ప్రారంభమైంది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న ప్రధాన రాజకీయ పార్టీలు గెలుపు కోసం వ్యూహరచన చేస్తున్నాయి. స్థానిక ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి ప్రతిష్టాత్మకంగా మారటంతో ముందుగానే ఎన్నికల కసరత్తును ప్రారంభించింది. ఆయా గ్రామాల్లో గెలిచే అభ్యర్థుల కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్వేషిస్తున్నారు. ఇక బీఆర్‌ఎస్ పార్టీ కూడా స్థానిక ఎన్నికల్లో బలమైన అభ్యర్థులను నిలిపేందుకు కసరత్తులు చేస్తుంది. గత ఎన్నికల్లో జెడ్పీటీసీతో పాటు ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బీఆర్‌ఎస్ గెలుచుకుంది. సీపీఐ, సీపీఎం పార్టీలు కూడా పార్టీ బలంగా ఉన్న గ్రామాల్లో సత్తా చాటేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకుంటుంది. ఇదిలాఉండగా గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తును కొనసాగిస్తూ వచ్చిన సీపీఐ ఈ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకునే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇక సీపీఎం, బీజేపీతో తప్ప కలిసొచ్చే ఏ పార్టీతోనైనా పొత్తు పెట్టుకునేందుకు సిద్ధంగా ఉందనేది పార్టీ నాయకులు చెబుతున్న మాటలను బట్టి తెలుస్తుంది. అలాగే బీజేపీ కూడా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలతో పాటు పంచాయతీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసేందుకు ప్రయత్నాలను సాగిస్తుంది. ఎన్నికలను ప్రధాన రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుండంతో రసవత్తరంగా మారనున్నాయి.

26 గ్రామ పంచాయతీలు, 14 ఎంపీటీసీలు..

మండల వ్యాప్తంగా జెడ్పీటీసీతో పాటు 26 గ్రామ పంచాయతీలు, 14 ఎంపీటీసీ స్థానాలున్నాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌తో సీపీఐ, బీఆర్‌ఎస్‌తో సీపీఎం పార్టీలు పొత్తు పెట్టుకుని పోటీలో నిలిచారు. 26 పంచాయతీల్లో బీఆర్‌ఎస్ మద్దతుతో అత్యధికంగా 14 పంచాయతీలను గెలుచుకోగా, కాంగ్రెస్ 8, సీపీఐ 4 పంచాయతీల్లో గెలుపొందింది. ఎన్నికల అనంతరం కాంగ్రెస్ మద్దతుతో గెలిచిన పాతర్లపాడు, తిరుమలాపురం, నర్సింహాపురం సర్పంచ్‌లు బీఆర్‌ఎస్ పార్టీలోకి వెళ్లారు. పార్టీ గుర్తులతో జరిగిన 14 ఎంపీటీసీ స్థానాల్లో బీఆర్‌ఎస్ పార్టీ 6స్థానాల్లో, కాంగ్రెస్ 4, సీపీఐ 2, సీపీఎం 2 స్థానాల్లో విజయం సాధించగా జెడ్పీటీసీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపొందాడు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ మద్దతుతో గెలిచిన సర్పంచ్‌ల్లో అనంతసాగర్, పాతర్లపాడు, చింతకాని సర్పంచ్‌లు, ఎంపీటీసీ స్థానాల్లో బీఆర్‌ఎస్ పార్టీ తరఫున గెలిచిన చింతకాని, తిమ్మినేనిపాలెం ఎంపీటీసీలు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. గత ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలుపొందిన సర్పంచ్ అభ్యర్థుల్లో కేవలం మూడు పంచాయతీల సర్పంచ్‌లు మాత్రమే కాంగ్రెస్ పార్టీలోకి రావటంతో ఇంకా బీఆర్‌ఎస్ పార్టీ మద్దతుతో గెలిచిన సర్పంచ్ స్థానాలు 13 ఉండటంతో బీఆర్‌ఎస్ పార్టీ కూడా గత ఫలితాన్ని పునరావృతం చేసేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తుంది.

ఆధిక్యత సాధిస్తాం..



ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారు. ప్రభుత్వ పథకాలతో మండలంలో కాంగ్రెస్ పార్టీ బలపడిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం. గ్రామాల్లో పోటీచేసే అభ్యర్థుల కోసం కసరత్తు చేస్తున్నాం.

– అంబటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు

గత ఫలితాలను పునరావృతం చేస్తాం..



గత ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికల ఫలితాలను పునరావృతం చేసేందుకు కృషి చేస్తున్నాం. గత ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థుల్లో మెజార్టీ అభ్యర్థులు బీఆర్‌ఎస్ పార్టీలోనే ఉన్నారు. గత ఎన్నికల్లో గెలిచిన ముగ్గురు సర్పంచ్‌లు, ఇద్దరు ఎంపీటీసీలు మాత్రమే కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు.

– పెంట్యాల పుల్లయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు

కాంగ్రెస్‌తో పొత్తుకు అవకాశం..



స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకునే అవకాశం ఉంది. మండలంలో పార్టీకి బలమున్న చోట ఎన్నికల్లో పోటీ చేస్తాం. గత ఎన్నికల మాదిరిగానే ఈసారి కూడా సీపీఐ పార్టీ ఎంపీపీ స్థానాన్ని కోరుకుంటుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టు పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నాం.

– పావులూరి మల్లికార్జున్‌రావు, సీపీఐ మండల కార్యదర్శి

రాజశ్యామల యాగంలో మంత్రి తుమ్మల



యాగంలో పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సత్తుపల్లి: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం సత్తుపల్లి పెద్దవంతెన సమీపాన శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో నిర్వహిస్తున్న రాజశ్యామల యాగానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసిన పూర్ణాహుతిలో పాల్గొన్నారు. అర్చకులు సుబ్రమణ్యశాస్త్రితో పాటు చలసాని సాంబశివరావు, నున్నా రత్నాకర్, చల్ల గుళ్ల నర్సింహారావు, ఖాజా శ్రీను, గాంధీ, భక్తులు పాల్గొన్నారు.

ప్లాంట్‌ను ప్రారంభించిన మంత్రి..

తల్లాడ: తల్లాడలోని మల్లవరం రోడ్డులో ఏర్పాటుచేసిన బయోమాస్ ప్లాంట్‌ను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఏపీలోని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభించారు. మొక్కజొన్న, మిరప, చెరుకు, వరి పొలాల్లో వ్యర్థాలను కాలుస్తుండడంతో వాయుకాలుష్యం పెరిగి, భూసారం తగ్గుతోందని, అలా జరగకుండా వ్యర్థాలను సేకరించి ప్లాంట్‌లో మెల్లేడ్స్‌గా మార్చి అవసరమైన కంపెనీలకు విక్రయిస్తామని ఎండీ వెనిగండ్ల మదన్‌కిషోర్ తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కల్లూరు మార్కెట్ చైర్మన్ నీరజ, నాయకులు మట్టా దయానంద్, దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, వేమిరెడ్డి కృష్ణారెడ్డి తదితరులుపాల్గొన్నారు.

కోళ్ల పెంపకంపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యాధికారి అశోక్

ముదిగొండ: కోళ్లకు వచ్చే వ్యాధులు వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం ముదిగొండ తహసీల్‌లో కోళ్ల పెంపకందారులకు అవగాహన కల్పించారు. సదస్సులో ముదిగొండ, వానంవారికిష్టాపురం పశువైద్యశాలల పశువైద్యులు అశోక్, రమేష్‌బాబులు మాట్లాడారు. కోళ్ల పెంపకందారులు సరైన జాగ్రత్తలు పాటించి కోళ్లను పెంచాలన్నారు. సదస్సులో తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, ఆర్ఐ ప్రసన్నకుమార్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ షాపులు తనిఖీ..



కల్లూరు చికెన్ సెంటర్‌లో కోళ్లను పరిశీలిస్తున్న ఈఓ నాగేశ్వరరావు

కల్లూరు: కల్లూరు పట్టణంలోని పలు చికెన్ షాపులను పంచాయతీ ఈఓ నందిశెట్టి నాగేశ్వరరావు తనిఖీ చేశారు. వైరస్ వచ్చి మృతి చెందిన కోళ్లను విక్రయిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. చనిపోయిన, వైరస్ భారిన పడిన కోళ్లను విక్రయించొద్దని యజమానులకు హెచ్చరించారు. చికెన్ షాపుల చుట్టూ శానిటైజేషన్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నర్సింహా

సత్తుపల్లిటౌన్: పట్టణంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహా అన్నారు. బుధవారం పట్టణంలోని పలు వార్డులలో చేపడుతున్న డ్రెయినేజీ పూడిక తీత తదితర పనులను పరిశీలించారు. తాగునీటి సరఫరా విభాగం సిబ్బందితో సమావేశం నిర్వహించి లీకేజీలు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట ఏఈ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, సూపర్‌వైజర్ బాబురావు ఉన్నారు.

పెండింగ్ చలానాలపై స్పెషల్ డ్రైవ్

సత్తుపల్లిటౌన్: వాహనాలకు పెండింగ్‌లో ఉన్న చలానాలపై సత్తుపల్లి పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు, ట్రాలీ వాహనాలను స్థానిక బాలుర హైస్కూల్ వద్ద జాతీయ రహదారిపై తనిఖీలు చేస్తూ చలానాలను పరిశీలిస్తున్నారు. పెండింగ్‌లో ఉన్నట్‌లతే వెంటనే చెల్లించాలని ఎస్సై కవిత ఆదేశించారు.

'గుడ్ అండ్ బ్యాడ్ టచ్'పై అవగాహన

ఎర్రుపాలెం: బాలికలు గుడ్ మరియు బ్యాడ్ టచ్‌లపై అవగాహన అవసరమని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్రవంతి తెలిపారు. బుధవారం మండలంలోని భీమవరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. చిన్నారుల భద్రత, సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ 1098 నంబర్‌కు కాల్‌చేయాలని, స్వయం శుభ్రత పెంచుకోవాలని, జంక్ ఫుడ్ తీసుకోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మాధవి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: ప్రభుత్వం అధికారికంగా సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను ఈ నెల 15న ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. బుధవారం వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి బంజారా నాయకులతో నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. సేవాలాల్ జయంతి వేడుకలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం హర్షణీయం అన్నారు. ఈ సందర్భంగా బంజారా నాయకులు.. రాష్ట్ర ప్రభుత్వం ఆ రోజున సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఐదు మండలాల బంజారా నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..

వైరాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పెరుగు ప్రసాద్, ఫణితి సురేష్‌లు బుధవారం బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి సాదరంగ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొత్త పాత నాయకులను కలుపుకుని పోతూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి కట్ల రంగారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ జైపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటనర్సిరెడ్డి, సీతారాములు, హరినాద్, సంతోష్, గంగారావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ గేట్లు తెరవండి..

వైరాలోని ఆర్టీసీ బస్టాండ్‌లో రెండు గేట్లు మూసివేయడంపై ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆర్టీసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఆర్‌ఎంకు ఫోన్ చేసి ప్రయాణికుల ఇబ్బందులను వివరించి గేట్లను తెరవాలని ఆదేశించారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల అధ్యక్షుడు వెంకటనర్సిరెడ్డి, నాయకులు తదితరులున్నారు.

రెండో రోజుకు చేరిన దీక్షలు

సత్తుపల్లి: మండలంలోని కొమ్మేపల్లి భూనిర్వాసితుల చేపట్టిన దీక్షలు బుధవారం రెండో రోజుకు చేరాయి. ఈసందర్భంగా జేవీఆర్ ఓసీ పీఓ ప్రహ్లాద్ దీక్షా శిబిరానికి వచ్చి రైతులతో చర్చించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినందున దీక్ష విరమించాలని కోరారు. అయితే, అవార్డు ప్రకారం తమ పేర్లపై వచ్చిన చెక్కులు సిద్ధం చేస్తేనే విరమిస్తామని వారు బదులిచ్చారు. ఈమేరకు రెండు, మూడు రోజుల్లో న్యాయం జరిగేలా ప్రయత్నిస్తామని పీఓ హామీ ఇచ్చారు. కాగా, యర్రా సూర్యనారాయణ, మోరంపూడి ప్రసాద్, కోటేశ్వరరావు, సుబ్బారావు, వలసపల్లి ప్రభాకర్‌రావు, వాసిరెడ్డి వసుప్రదరాణి, యర్రా లీలావతి తదితరులు దీక్షల్లో పాల్గొనగా రైతు సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చింతకాని: చింతకాని విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా చింతకాని సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి గ్రామాలకు గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామప్రజలు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు వీడ్కోలు



విద్యార్థినులతో ఉపాధ్యాయులు, అధ్యాపకులు

ఎర్రుపాలెం: మండకేంద్రంలోని గురుకుల, కళాశాలలో బుధవారం విద్యార్థినులకు తోటి విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంఈఓ మురళీమోహన్‌రావు మాట్లాడుతూ.. పది, ఇంటర్ పరీక్షలు బాగా రాసి పాఠశాలకు, కళాశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, పేరెంట్స్ కమిటీ సభ్యులు చిట్టిబాబు, లోకేశ్వరరావు, బాబురావు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ నీటిని విడుదల చేయాలి

చింతకాని: చింతకాని మేజర్‌కు సాగర్ నీటిని విడుదల చేయాలని మధిర నియోజకవర్గ ఆత్మ కమిటీ డైరెక్టర్ కొప్పుల గోవిందరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గోపి కోరారు. ఖమ్మం ఇరిగేషన్ కార్యాలయంలో బుధవారం చీఫ్ ఇంజనీర్ రమేష్‌బాబు, సూపరింటెండెంట్ ఇంజనీర్ వసంత లను కలిసి విజ్ఞప్తి చేశారు. అధికారులు వెంటనే స్పందించి చింతకాని మేజర్‌కు సాగర్ జలాలను విడుదల చేశారు.

పరామర్శ..

తల్లాడ: మండలంలోని వెంగన్నపేట గ్రామంలో పలు కుటుంబాలను రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ బుధవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కల్యాణపు సాంబశివరావు, తొండపు శాంతమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతి చెందిన వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. నీరజ, కాంగ్రెస్ నాయకులు సుధాకర్, రామక్రిష్ణ, రవి పాల్గొన్నారు.

శానిటరీ ప్యాడ్లు పంపిణీ

మధిర: మధిర పట్టణంలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల పాఠశాల, కళాశాలలో బుధవారం విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ ప్యాడ్లు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం జయంతి గ్రామానికి చెందిన క్రీడా చేయూత సంస్థ అధ్యక్షుడు గూడూరు కోటిరెడ్డితో పాటు స్నేహితుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ విద్యాసంస్థల అధినేత, డైరెక్టర్ శీలం వెంకటరెడ్డి, విద్యాలత మాట్లాడుతూ... రూ 25 వేలు విలువచేసే ప్యాడ్లు ఉచితంగా అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శిరీష, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

కారేపల్లి: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన వెంకిట్యాతండా గ్రామానికి చెందిన భూక్యా విజయ కుటుంబానికి, వెంకిట్యాతండా ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.6వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా.. ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి శంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు బాలాజీ, శంకర్, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పలకలు..



విద్యార్థులతో దాతలు, సిబ్బంది

మధిర: మధిర పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు పలకలు పంపిణీ చేశారు. మధిర ఆయుర్వేద వైద్యశాల ఉద్యోగి కందుల రాంబాబు మనవడు శాంత్ నందన్ అక్షరాభ్యాసం సందర్భంగా విద్యార్థులందరికీ పలకలు, బలపాలు వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నిర్మల, ఆయుష్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా..

మధిర: దెందుకూరు దళిత కాలనీ ప్రాథమిక పాఠశాలకు అమిరినేని వెంకటనారాయణ జ్ఞాపకార్థం ఆయన మనుమడు కొల్లి సందీప్ రూ.12 వేలు విలువగల బీరువాను బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం శ్యామలరావు సందీప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు నాగరాజు, మహమూద్, సునీత తదితరులు పాల్గొన్నారు.

మిర్చి కొనుగోళ్లు చేపట్టాలి

కొణిజర్ల/వైరారూరల్/ఏన్కూరు: మిర్చి ధరలు క్షీణిస్తున్న నేపథ్యాన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నేత్వత్వాన కొనుగోళ్లు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు కోరారు. కొణిజర్ల మండలం సింగరాయపాలెంలో బుధవారం ఆయన మాట్లాడుతూ తెగుళ్లతో దిగుబడి తగ్గిన నేపథ్యాన రైతులను ఆదుకోవాలన్నారు. అలాగే, వైరా మండలం అష్ణగుర్తిలో రాంబాబు మాట్లాడుతూ రెండెకరాల లోపు సాగు భూమి కలిగిన రైతులందరికీ పూర్తిస్థాయిలో రైతు భరోసా నగదు జమ చేయాలన్నారు. కాగా, ఏన్కూరు మండలం జన్నారంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 17న జరగనున్న రైతుల మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు కృష్ణార్జునరావు, మిద్దె రామారావు, మధు, రామయ్య, వెంకటి, ఉపేందర్, కొణిదెన కోటేశ్వరరావు, బాణాల శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు, చిత్తారు లక్ష్మణ్, గుమ్మా మురళి, అడపా రామారావు తదితరులు పాల్గొన్నారు. కాగా, వైరా మండలం అష్ణగుర్తిలో మిర్చి కల్లాలను పరిశీలించిన సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ క్వింటాకు రూ.25వేలు చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు తూము సుధాకర్, సుంకర సుధాకర్ పాల్గొన్నారు.



వైరారూరల్: అష్ణగుర్తిలో మిర్చిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

లక్ష్య సాధనకు విద్యార్థులు శ్రమించాలి

బోనకల్: విద్యార్థులు లక్ష్యం ఏర్పరుచుకొని సాధన చేసి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రిటైర్డ్ ఏఎస్‌డబ్ల్యూ రావూరి రాజు అన్నారు. బుధవారం మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోవిందాపురం నందు తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం పది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలస్వామి, రమాదేవి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న రావూరి రాజు

విద్యార్థులకు ప్రతిభా పరీక్ష



తల్లాడ: సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం



కల్లూరు: విద్యార్థినులకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ నివేదిత

వైరా: పీఎస్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలస్థాయిలో నిర్వహించిన ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల రెబ్బవరం బాలికలు షేక్ జమీనా ప్రథమ, తిరుమలదాసు మాధురి ద్వితీయ స్థానం సాధించారు. వారిని ఎంఈఓ వెంకటేశ్వరరావు, గొల్లపూడి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయబాబు, వైరా ఉన్నత పాఠశాల పీడీ కృష్ణమూర్తి బహుమతులు అందజేశారు.

కొణిజర్లలో..

కొణిజర్ల: కొణిజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ప్రతిభా పోటీలు నిర్వహించగా.. సింగరాయపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థులు వేము షర్మిల, యం.నాగ యశ్విని, ఎల్.విష్ణులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతలు సాధించారు. వారికి ఎంఈఓ డి.అబ్రహం బహుమతులు అందించారు.

తల్లాడ: మండల విద్యార్థులకు తల్లాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రతిభా పరీక్షలు నిర్వహించగా.. ప్రథమ బహుమతి ఎస్‌కె ఆసీఫ్ (పినపాక), ద్వితీయ పి.వేణు (పినపాక), తృతీయ సాయిదుర్గ (బిల్లుపాడు) విద్యార్థులు గెలుపొందారు. వీరికి తల్లాడ హైస్కూల్ హెచ్‌ఎం నాగేశ్వరరావు బహుమతులు అందించారు. ఈ నెల 16న జిల్లా స్థాయిలో నిర్వహించే టాలెంట్ టెస్ట్‌కు ఎంపికయ్యారన్నారు.

కల్లూరు: మండలంలోని ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల్లో.. ప్రథమ, ద్వితీయ బహుమతులు కల్లూరు బాలికల పాఠశాల విద్యార్థులు బి.నాగప్రియ, వి.చెస్మిత గెలుచుకోగా.. తృతీయ బహుమతి చంద్రుపట్ల పాఠశాల విద్యార్థి ఆర్.లక్ష్మి సాత్విక గెలుచుకుంది. వీరికి ఎంఈఓ పి.నివేదిత బహుమతులు అందించారు.

పెనుబల్లి: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పరీక్షలో.. చింతగూడెం హైస్కూల్ విద్యార్థి శ్యామ్ ప్రథమ, సీహెచ్ వినయ్‌లు ద్వితీయ బహుమతులు సాధించగా.. వీయంబంజర్ హైస్కూల్ విద్యార్థి సీహెచ్ జోషిక తృతీయ స్థానం సాధించింది. విజేతలకు షీల్డ్, మెరిట్ సర్టిఫికెట్స్ అందజేశారు.

బోనకల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో చిరునోముల ఉన్నత పాఠశాల విద్యార్థి కె.వెంకట శివతేజ (ప్రథమ), రావినూతల స్కూల్ విద్యార్థి శ్రీవల్లి (ద్వితీయ), బోనకల్ విద్యార్థి మనస్విని (తృతీయ) స్థానాల్లో నిలిచారు. దీంతో వారికి పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు బహుమతులు అందించారు. వీరు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి క్విజ్ పోటీలను నిర్వహించగా.. గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓ మురళీమోహన్‌రావు బహుమతులు అందించారు.